క్లుప్తంగా

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఎనిమిది దరఖాస్తులు



గుడివాడ టౌన్: గుడివాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎనిమిది దరఖాసులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ తెలిపారు. సమస్యల పరిష్కారానికి వెంటనే సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చి పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, మున్సిపల్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, మున్సిపల్ మేనేజర్ బి. నిర్మలకుమారి, ఏఓ జీటీ నాయుడు, ఏసీపీ వి. ఏసుబాబు పాల్గొన్నారు.

నేడు అంకమ్మ తల్లి ఆలయంలో అన్నాభిషేకం

పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని అంకమ్మతల్లి ఆలయంలో మంగళవారం అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు వరదా అప్పారావు సోమవారం తెలిపారు. భాద్రపద మాసం ఆరుద్రనక్షత్రం సందర్భంగా రేణుకా పరమేశ్వరునికి పంచామృత అభిషేకం అనంతరం స్వామికి అన్నాభిషేకం జరుగుతుందని పేర్కొన్నారు.

శాశ్వత కార్యదర్శిని నియమించండి



మండవల్లి: మండవల్లి మేజర్ పంచాయతీకి శాశ్వత కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, తగిన సిబ్బందిని నియమించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి.అప్పారావు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కె.గోపాల్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. సచివాలయంలో కార్యదర్శి డిజిటల్ అసిస్టెంట్ లేక ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇన్‌చార్జి కార్యదర్శి ఎప్పుడు వస్తారో తెలియకపోవడంతో ప్రజలు కార్యాలయం చుట్టూ తిరగడం తప్ప పనులు జరగడం లేదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, కార్యదర్శి కె.అర్జునరావు పాల్గొన్నారు.

అల్లినగరంలో బ్రహ్మాస్త్రం తయారీ

మండవల్లి: అల్లినగరంలో పచ్చపురుగు, ఆకుముడత, పొగాకు లద్దెపురుగు నివారణకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో 50 లీటర్ల బ్రహ్మాస్త్రం సోమవారం తయారు చేశారు. ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు ఖర్చు తగ్గించుకుని నాణ్యమైన ఆహార ఉత్పత్తులను పొందడానికి ప్రకృతి వ్యవసాయం మంచి మార్గమని తెలిపారు. అన్ని రకాల పంటలకు కావాల్సిన ప్రకృతి వ్యవసాయ కషాయాలు, ద్రావణాలు, అల్లినగరం గౌతమ్ నేచురల్స్ అండ్ ఆర్గానిక్స్ ప్రకృతి వ్యవసాయ వనరుల, ఉత్పత్తుల కేంద్రం వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు.

డోకిపర్రు పీఏసీఎస్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం జరిగింది. బాధ్యతలు చేపట్టిన కమిటీ సభ్యులకు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుభాకాంక్షలు తెలిపారు. ఆ సంఘ చైర్మన్‌గా చింతపల్లి శివారెడ్డి, సభ్యులుగా చిలక నాగరాజు, డొక్కు రాంబాబు బాధ్యతలు చేపట్టారు. స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్య చౌదరి, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



మండవల్లి: స్థానిక సచివాలయ పరిధిలో మిగిలిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ మెండా ఝాన్సీ సోమవారం పరిశీలించారు. రైస్ కార్డులో పేరున్న ఎవరైనా ఒకరు ఈకేవైసీ చేయించుకోవాలని సర్పంచ్ తెలిపారు. ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన వంతెనలు

- ఆందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పెదపారుపూడి: మండలంలోని పలు గ్రామాల్లో వంతెనలు శిథిలావస్థకు చేరాయి. ఇవి ఎప్పుడు కూలిపోతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పాములపాడులోని దోసపాడు చానల్‌పై ఉన్న వంతెన బ్రిటిష్ కాలం నాటిది కావటంతో శిథిలావస్థకు చేరింది. వంతెన కింద శ్లాబ్ పెచ్చులు ఊడి ఇనుప కమ్ములు కనిపిస్తున్నాయి. రైతులు పండించిన ధాన్యాన్ని, ఎరువులను ట్రాక్టర్లపై తరలించాలంటే ఈ వంతెనపైనే వెళ్లాల్సి ఉంది. ఆ సమయంలో ఎక్కడ కూలిపోతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చంద్రయ్య డ్రెయిన్‌పై వంతెన కూడా..

చినపారుపూడి వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు మార్గంలో చంద్రయ్య డ్రెయిన్‌పై ఉన్న వంతెన కూడా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ వంతెనపై పామర్రు వెళ్లేందుకు వానపాముల, జమిదింటకుర్రు, వెంట్రప్రగడ, చినపారుపూడి, జువ్వనపూడి తదితర గ్రామాల ప్రజలు నిత్యం ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన నిర్మాణ పనులు చేపట్టి 30 సంవత్సరాలు దాటుతున్నా వంతెనకు మరమ్మతులు చేయలేదు. దీంతో వంతెన కింద శ్లాబ్ పెచ్చులు ఊడి ఇనుప కమ్ములు కనపడుతున్నాయి. దీంతో రాత్రిళ్లు వంతెన పై నుంచి రాకపోకలు సాగించాలంటే ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని మలేశ్వరపురం పాత లింగవరం చానల్‌పై ఉన్న వంతెన కూడా శిథిలావస్థకు చేరింది. కొన్ని నెలల కిందట వంతెన గోడ కూలి చానల్లో పడిపోయింది. ఆర్అండ్‌బీ అధికారులకు వంతెన సమస్యను తెలియజేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వంతెనపై నుంచి దోసపాడు, పాములపాడు, గుర్విందగుంట, మహేశ్వరపురం గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వెంట్రప్రగడ దోసపాడు చానల్‌పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. గుడివాడ–కంకిపాడు రహదారి కావటంతో నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఇప్పటికైనా ఆర్అండ్ బీ అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన వంతెనలకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మహేశ్వరపురం వద్ద అధ్వానంగా మారిన వంతెన



వెంట్రప్రగడ దోసపాడు చానల్‌పై కూలేందుకు సిద్ధంగా ఉన్న వంతెన

వంతెనలకు మరమ్మతులు చేపట్టాలి

పాతలింగవరం చానల్‌పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. రాత్రి సమయంలో ఎప్పుడు కూలిపోతుందోనని భయం వేస్తోంది. ఎన్నో సంవత్సరాల నుంచి మరమ్మతులు చేపట్టలేదు. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన వంతెనలకు మరమ్మతులు చేపట్టాలి.



– కలుగురి వెంకటేశ్వరరావు, మహేశ్వరపురం

ఘనంగా ఇంజినీర్స్ డే



గుడివాడలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఇస్రో ఇంజినీర్ రాజా వీఎల్ఎన్ శ్రీధర్



మండవల్లి హైస్కూల్లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయ్‌కుమార్



గుడ్లవల్లేరు లయన్స్ సేవాభవన్‌లో విశ్వేశ్వరయ్యకు నివాళులు

గుడివాడ టౌన్: ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకుని ఇంజినీర్స్ డేను పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల్లో జరిగిన ఇంజినీర్స్‌డే కు ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) శాస్త్రవేత్త రాజా వీఎల్ఎన్ శ్రీధర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఇంజినీర్స్ డే యొక్క ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, కరస్పాండెంట్ వేములపల్లి కోదండ రామయ్య, డైరెక్టర్ కల్యాణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ. రామారావు, అధ్యాపకులు, విద్యార్థుల ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే జరిగింది. లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీర్లు ప్రసాద్, శరత్ చంద్ర, శివాజీని సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎం.సురేష్, కార్యదర్శి పి. కేశవరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఇంజినీర్ల పాత్ర వెలకట్టలేనిది

మండవల్లి: ఇంజినీర్ల పాత్ర వెలకట్టలేనిదని సుధమ ఫౌండేషన్ అధినేత, ప్రొఫెసర్ సూధాబత్తుల విజయ్‌కుమార్ అన్నారు. ఇంజినీర్స్‌డే సందర్భంగా స్థానిక హైస్కూల్లో హెచ్ఎం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన విజయ్‌కుమార్ మాట్లాడారు. సమాజానికి, దేశ సర్వతోముఖాభివృద్ధికి ఇంజినీర్ల పాత్ర, ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. యువ ఇంజనీర్లు నాగబాబు, అజయ్‌బాబు, ఉపాధ్యాయులు సత్యనారాయణ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా సాయి విద్యానికేతన్ పాఠశాల అధినేత సింగంశెట్టి ఆదినారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఆయన చిత్ర పటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇంజినీర్‌గా విశ్వేశ్వరయ్య అందించిన సేవలకు గాను సెప్టెంబర్ 15వ తేదీన ఆయన జన్మదినాన్ని ఇంజినీరింగ్‌డే గా జరుపుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, లయన్స్ అధ్యక్షుడు పెరుమాళ్ల తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు చెల్లించాలి



గుడివాడ టౌన్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద శానిటరీ కాంట్రాక్ట్ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు సీహెచ్ సత్యనారాయణ, గూడపాటి ప్రకాష్‌బాబు మాట్లాడారు. నాలుగు నెలలుగా కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు చెల్లించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీని వలన కార్మికులు పీఎఫ్, ఈఎస్ఐ వాయిదాలు సకాలంలో కట్టలేక కొన్ని సౌకర్యాలు కోల్పోతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయలక్ష్మి, రాణి, నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సులభశైలిలో బోధించాలి



ముదినేపల్లి రూరల్: ప్రాథమిక విద్యార్థుల మానసిక సామర్థ్యాలకు అనుగుణంగా పాఠాలు బోధించాలని ఎంఈఓ కె.నరేష్‌కుమార్ అన్నారు. మండలంలోని కాకరవాడ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఒకే రీతిన బోధిస్తే విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయడం కష్టతరమవుతుందన్నారు. వారి మానసిక పరిపక్వత ఆధారంగా బోధిస్తూ ఉత్తమ ఫలితాలు రాబట్టాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం అమలు చేయాలని సూచించారు.

రేపు కొండలమ్మ దేవస్థాన నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరంలోని శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థాన నూతన కమిటీ ప్రమాణ స్వీకారం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ గవర్నమెంట్, దేవదాయశాఖ కమిషనర్ వారి కార్యాలయ ఉత్తర్వుల ప్రకారం ధర్మకర్తల మండలి నియామకం జరిగిందని పేర్కొన్నారు.

పేర్ని నానిని విమర్శించే స్థాయి కుమార్‌రాజాకు లేదు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్

పామర్రు: వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య(నాని)ని విమర్శించే స్థాయి స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు లేదని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. పేర్ని నాని రాజకీయ అనుభవం అంత లేదు కుమార్ రాజా వయస్సు అని పేర్కొన్నారు. 15 నెలలుగా కూటమి ప్రభుత్వ అవినీతి పాలనతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కృష్ణా జిల్లాలోనే ఎక్కువ ఆదాయం సంపాదించే ఎమ్మెల్యేగా కుమార్‌రాజా ఎదిగి ప్రజా ధనాన్ని రోజుకు సుమారు రూ.50 లక్షలు దోచుకుంటున్నారని విమర్శించారు. కేజీ రేషన్ బియ్యానికి రూ.6 చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి గ్రామంలోని రేషన్ డీలర్లను బెదిరిస్తూ పేదలకు దక్కాల్సిన బియ్యాన్ని ఎమ్మెల్యే కను సన్నలలో ఉంచుకుని రూ.లక్షలు దండుకుంటున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

బెల్టు షాపులు, పేకాట శిబిరాల నిర్వహణపై వసూలు

నియోజకవర్గంలో జరుగుతున్న పేకాట శిబిరాలు, బెల్టు షాపుల నిర్వహణకు మండలానికో ఏజెంట్‌ను ఏర్పాటు చేసి ఎమ్మెల్యే కుమార్ రాజా వసూళ్లకు పాల్పడుతున్నారని అనిల్‌కుమార్ విమర్శించారు. నియోజకవర్గంలో రొయ్యూరు, లంకపల్లిలో జరుగుతున్న ఇసుక క్వారీలలో రూ.కోట్ల నగదు చేతులు మారుతున్నాయన్నారు. క్వారీలో పొక్లెయినర్ బకెట్‌కు రూ.1,000 చొప్పున తమ్ముళ్లతో వసూలు చేస్తున్నారన్నారు. ఇందుకోసం విజయవాడ ఆటో నగర్‌లో ఆఫీసు పెట్టి లావాదేవీలను నిర్వహిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అదేవిధంగా లంకపల్లి గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ సొసైటీలకు ఇచ్చిన 600 ఎకరాల భూమిని రీ సర్వే పేరుతో దోచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఐనంపూడిలో పేదలు సాగు చేసుకునేందుకు ఇచ్చిన భూమిని బలవంతంగా లాక్కుని ఆ భూమిలో మెగా ఇండ్రస్టియల్ పార్కుకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారన్నారు.

నాగాపురం భూ బాధితులకు న్యాయం చేస్తే సన్మానం

పెదపారుపూడి మండలం నాగాపురంలోని భూ బాధితులైన దళితులకు న్యాయం చేయాలని కైలే అనిల్‌కుమార్ కోరారు. దళితుల భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న ఓ వ్యక్తికి స్థానిక కూటమి పెద్దలు అండగా ఉంటూ రాజకీయం చేస్తున్నారన్నారు. దళితులకు న్యాయం చేస్తే పామర్రులో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు, ఆయన తండ్రి వర్ల రామయ్యకు సన్మానం చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, టౌన్ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, పెదపారుపూడి పార్టీ నాయకులు నామా వెంకటేశ్వరరావు, గోళ్ల సోమేశ్వరరావు, జీ సుబ్రమణ్యం, చెదుర్తి వరప్రసాద్, హర్ష వర్ధన్, సువర్ణరాజు, పెయ్యల రాజు తదితరులు పాల్గొన్నారు.

రజకులపై కూటమి నాయకుల దాడులు దారుణం



విలేకరులతో మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు

గుడివాడ టౌన్: బీసీలలో అల్ప సంఖ్యాకులైన నాయీ బ్రాహ్మణులు, రజకులు వంటి వారిపై కూటమి నాయకులు దాడి చేయడం దారుణమని గుడివాడ రజక సంఘం నాయకులు అన్నారు. గుడివాడ రజక సంఘం కార్యాలయంలో సోమవారం ఆ సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటరెడ్డయ్య మాట్లాడారు. రజకులకు రక్షణ కల్పించేలా చట్టం తీసుకురావాలన్నారు. ఇప్పటికే కృష్ణా జిల్లాలో రజక సంఘీయులపై నాలుగుచోట్ల దాడులు జరగడం బాధాకరమన్నారు. ఈ సామాజిక వర్గాలపై జరుగుతున్న దమనకాండను ఖండిస్తున్నామన్నారు. దాడులకు పాల్పడిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మచిలీపట్నంలో గిరిధర్ అనే రజకుడిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు నయనవరపు శేషుబాబు, ఓ. శ్రీనివాసరావు, పి. నాగేశ్వరరావు, బి. ఉమా శ్రీనివాసరావు, పి. నాగబాబు, సీహెచ్ శంకర ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గుడివాడ టౌన్: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాల్లో రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మార్పీఎస్ గుడివాడ డివిజన్ ఆధ్వర్యంలో ఆర్డీఓ జి. బాలసుబ్రహ్మణ్యానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2004 నుంచి ఎస్సీ వర్గీకరణపై పోరాటం చేస్తున్నామన్నారు. గత ఏడాది సుప్రీం కోర్టు వర్గీకరణ జరగాలని తీర్పు ఇచ్చినప్పటికీ దానిని ఆచరణలో పెట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంచర్ల సుదాకర్, జిల్లా అధ్యక్షుడు కె. గంగాధర్, ఎ. కమల, పి. శేఖర్‌బాబు, సీహెచ్ సంసోను, టి. ప్రశాంత్ రాజు, కె. మరియదాసు, కె. దాసు, సీహెచ్ వినోదరావు, ఎ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలకు గాయాలు

కురుమద్దాలి(పామర్రు): మండలంలోని కురుమద్దాలి ఫ్లై ఓవర్ వద్ద జరిగిన ప్రమాదంలో నలుగురు మహిళలు గాయపడిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి పక్కనే కురుమద్దాలి శివారు ప్రాంతంలో ఓ రొయ్యల ఫ్యాక్టరీలో విధులు నిర్వహించుకుని తిరిగి తమ ఊరు వెళ్లేందుకు మహిళలు పామర్రు వెళ్లే ఆటో ఎక్కారు. ఆ ఆటోలో మొత్తం ఎనిమిది మంది ప్రయాణిస్తున్నారు. అక్కడి నుంచి బయలు దేరిన ఆటో కురుమద్దాలి ఫ్లై ఓవర్ వద్దకు చేరుకునే సమయంలో ఎదురుగా వెళ్తున్న బైక్‌ను ఓవర్ టేక్ చేయబోగా ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న గుడివాడకు చెందిన చంద్రపాటి ప్రియాంక, మన్నేపల్లి మరియమ్మ, చలమల ధనలక్ష్మి, నాగదాసి సోనికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను గుడివాడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పామర్రు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

సుబ్బారాయుడికి వెండి సమర్పణ

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కొలువైయున్న స్వామికి భక్తులు సోమవారం వెండిని సమర్పించారు. కలిదిండికి చెందిన కట్టా గోపి కుటుంబ సభ్యులు అర్ధ కిలో వెండిని స్వామికి సమర్పించారు. బొర్రా చలమయ్య, బొంగు రవికుమార్, ఏడుకొండలు, బొర్రా శేషు పాల్గొన్నారు.

18 నుంచి స్కూల్ గేమ్స్

మండవల్లి: మండల స్కూల్ గేమ్స్ ఈ నెల 18, 19 తేదీల్లో లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్వహించనున్నట్లు ఎంఈఓ–1 సురేష్, మండల కో–ఆర్డినేటర్ వేణుబాబు, పీఈటీ తెలిపారు. మండల వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం ఎంఈఓ–1 ఆధ్వర్యంలో సోమవారం జరిగింది.

సంక్షిప్త వార్తలు

■ అమరరాజుకు నివాళి



ముదినేపల్లి రూరల్: చిగురుకోటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కోమటి వెంకట అమరరాజుకు పార్టీ నాయకులు సోమవారం నివాళులర్పించారు. అమరరాజు సంస్మరణ కార్యక్రమం గ్రామంలో జరిగింది. పార్టీ నియోజకవర్గ నాయకుడు దూలం వీరశ్యాంఫణికుమార్, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి గంటా సంధ్య, జిల్లా అధికార ప్రతినిధి మోట్రు ఏసుబాబు, నాయకులు గంటా కోటేశ్వరరావు, సింగంశెట్టి రాము, సమయం రామాంజనేయులు, రాచూరి కుమార్, వైస్ ఎంపీపీ రాచూరి రాధా తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

■ సర్వేకు పోలీసు బందోబస్తు కల్పించాలి

ముదినేపల్లి రూరల్: గ్రామ పంచాయతీ చెరువు సర్వేకు సంబంధించి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు కల్పించాలని చినకామనపూడి సర్పంచ్ చిట్టూరి నంచారయ్య పాలకవర్గ సభ్యులు ఎస్పీని కోరారు. ఈ మేరకు ఏలూరులో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎస్పీకి వినతిపత్రం ఇచ్చారు. ఈ చెరువుకు సంబంధించి గతంలో సర్వే చేపట్టగా స్థానిక నాయకులు కొందరు అడ్డుకున్నారని తెలిపారు. చెరువు ఆక్రమణలు తొలగించి తవ్వకం చేసేందుకు పంచాయతీతో పాటు గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినప్పటికీ కొందరు వ్యక్తులు సర్వేను అడ్డుకుంటున్నట్లు చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా ఈ నెల 17న డివిజనల్ సర్వేయర్ సర్వే నిర్వహించనున్నారని, ఇందుకు తగిన బందోబస్తు కల్పించాలని కోరారు. ఉపసర్పంచ్ భట్రాజు శ్రీలక్ష్మీ, పాలకవర్గ సభ్యులు నాగమల్లేశ్వరీ, ధనలక్ష్మి, సహదేవుడు, వీరకుమారి, గంగా, రామాంజనేయులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

■ నాలుగు డీఏలను విడుదల చేయాలి

కైకలూరు: ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. కై కలూరు తహసీల్దారు కార్యాలయంలో తాలూకా యూనిట్ తరఫున వినతిపత్రాన్ని సోమవారం అందించారు.



నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అలసత్వాన్ని ప్రదర్శిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు, వేతన సవరణలు, కరువు భత్యం మంజూరు జరగడం లేదన్నారు. కార్యక్రమంలో కైకలూరు, కలిదిండి, మండవల్లికి చెందిన ఏపీటీఎఫ్ నాయకులు నంబూరు భాస్కర వర్మ, వడ్డి శ్రీనివాసరావు, అక్బర్ హుస్సేన్, నున్న శ్రీనివాస్, లూయిస్, కళారి శ్రీనివాస్, వీవీ.రాజారావు, సముద్రుడు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

■ టీకాలను సద్వినియోగం చేసుకోవాలి

యలమర్రు(పెదపారుపూడి): ప్రభుత్వం పశువుల కోసం ఉచితంగా అందిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమారరాజా పేర్కొన్నారు. మండలంలోని యలమర్రుప్ర సోమవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా పశువర్ధక శాఖ అధికారి జీవీ నరసింహారావు, ఉప సర్పంచ్ సత్యనారయణ పాల్గొన్నారు.



■ దసరా ఉత్సవాల కమిటీ నియామకం

కైకలూరు: శ్యామలాంబ దేవస్థానంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు జరుగు చండీ మహాయాగ సహిత దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల నిర్వహణకు దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులతో ఉత్సవ కమిటీని సోమవారం నియమించారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా జంపన రామలింగరాజు, సింహాద్రి రాంబాబు, పోతునూరి సుజాత, అన్నం వెంకట అంజని, నాగనబోయిన నాంచారయ్య, దేవరపల్లి వెంకటసుబ్రహ్మణ్యశర్మ, కటికన పద్మావతి, గాదంశెట్టి ఉషారాణి, గొల్లు గౌరీశ్రీ, ఇంటి ఝాన్సీరాణి, పంద్రంగి కనక దుర్గాప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మొదటి రోజు అమ్మవారి దేవస్థానంలో పూజలు చేసి ఉత్సవ పనులను పర్యవేక్షించారు. ఆలయ ఈఓ వీఎస్‌కే.శేఖర్ ఉత్సవ ఏర్పాట్లను వివరించారు. అందరూ సమన్వయంతో పనిచేసి దసరా ఉత్సవాలను దిగ్విజయం చేయాలని జంపన రామలింగరాజు కోరారు.